

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 822 క్యూసెక్కులు వదులుతున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సీఆర్‌డీఏ విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా విజయ్‌కుమార్



మంగళగిరి: సీఆర్‌డీఏ విద్యుత్ శాఖ ఎస్‌ఈగా డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అమరావతి డివిజన్ ఈఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయ్‌కుమార్ ఉదోగోన్నతిపై సీఆర్‌డీఏ ఎస్‌ఈగా నియమితులయ్యారు. బుధవారం రాయపూడిలోని సీఆర్‌డీఏ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా పలువురు విద్యుత్‌శాఖ అధికారులు అభినందనలు తెలిపారు. విజయవాడ టీపీఎస్ఎస్ ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న టీవీ తులసీరామ్ అమరావతి ఈఈగా బుధవారం బాధ్యతలు చేపట్టగా డీఈఈ అక్కల సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

నేడు వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టు దుర్గ కాలినడక

పెదకాకాని: జాతి సమైక్యత కోరుతూ వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టూ దుర్గ కాలి నడక నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం 5:30 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గ నుంచి నడక ప్రారంభమవుతుందన్నారు. 1500 మంది విద్యార్థులతో 33 కిలోమీటర్లు మేర ఈ కాలినడక కొనసాగుతుందని తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 576.50 అడుగుల వద్ద ఉంది. ఇది 272.9955 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,500, ఎడమకాలువకు 8,541, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,761 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 20,761 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది. ఇది 83.9086 టీఎంసీలకు సమానం.

యార్డుకు 65,627 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 65,627 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 60,259 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.28,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.13,500 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.13,000 నుంచి రూ.20,000 వరకు ధర పలికింది.

సంక్రాంతి.. దోపిడీ

- ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్
- ఆన్‌లైన్‌లో రెండు రకాల టికెట్ రేట్లు
- మాన్యువల్ అయితే.. మరింత దోపిడీ
- మామూళ్ల మత్తులో ఆర్టీఓ కార్యాలయ అధికారులు
- సమావేశాలతో సరిపెడుతున్న వైనం
- నిబంధనలు విస్మరించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలుపుదల

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డుఅదుపూ లేకుండా దోచుకుంటున్నాయి. నిబంధనలను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 150 వరకు ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతోపాటు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు తరలివస్తున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ధరలకు అనుగుణంగానే టికెట్ ధరలు ఉండాలనే రవాణాశాఖ అధికారుల సూచనలను ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఖాతరు చేయని పరిస్థితులు కనపడుతున్నాయి.

బుక్ చేస్తే.. మరో ధర

ప్రైవేట్ ట్రావెల్స్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు అనేక రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆ యాప్‌లు ఓపెన్ చేయగానే ఒక ధర.. అన్ని ఆప్షన్స్ పూర్తి చేసిన తర్వాత బుక్ చేసుకునే సమయానికి మరో ధర వస్తోంది. మంగళగిరికి చెందిన ఓ విద్యార్థిని పండుగ నిమిత్తం బెంగళూరు నుంచి సొంత ఊరికి వచ్చేందుకు టికెట్ బుక్ చేసుకుంది. ముందు టికెట్ ధర రూ 1700 చూపించిన క్రమంలో బుక్ చేసే సరికి రూ.2400 అయింది. ఇంచుమించుగా యాప్‌ల్లో ఇదే పరిస్థితి కనపడుతోందని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లోనే ఇదే విధంగా వ్యవహరిస్తే.. సాధారణంగా ఒక కార్యాలయానికి వెళ్లి టికెట్ బుక్ చేసుకునే వారి పరిస్థితి ఇక చెప్పాల్సిన పనిలేదు.




ఓ ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయం వద్ద ప్రయాణికులు

ఆర్టీఓ అధికారులు సూచించిన ధరల కంటే అధికంగా దోచుకుంటున్నారు.

సమావేశాలకే పరిమితం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపట్టాల్సిన ఆర్టీఓ అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధిక ధరలతో ప్రయాణికులను దోపిడీ చేస్తున్నా.. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు చేస్తున్నామని పేరుకే తప్ప.. ఎక్కడా పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోటార్ వెహికల్ నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల లోపు ప్రైవేట్ బస్సులు ఉండకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఆర్టీఓ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే వాదనలు లేకపోలేదు. మంగళవారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాయంత్రం సమయంలో ప్రైవేట్ బస్సుల వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నప్పటికీ కనీసం ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవటం గమనార్హం.



ఒకే టికెట్‌లో రెండు రకాల రేట్లు చూపిస్తున్న పరిస్థితి

ధరల వివరాలు ఇలా...

ఏపీఎస్ఆర్టీసీ టికెట్ ధరలకు అనుగుణంగా ప్రైవేట్ ట్రావెల్స్ ధరలు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి.

గుంటూరు నుంచి హైదరాబాద్‌కు

	(ఆర్టీసీ)	ప్రైవేట్ ట్రావెల్స్
నాన్ ఏసీ	రూ.500	రూ.900
ఇంద్ర	రూ.670	ఏసీ రూ.1500పైగా
అమరావతి	రూ.940	స్లీపర్ రూ.2000
బెంగళూరుకు		
ఏసీ రూ.1450		రూ.2500 నుంచి రూ.3వేలు
చెన్నై		
నాన్ ఏసీ రూ.700		--
ఏసీ రూ.950		రూ.1500

తనిఖీలు నిర్వహిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. మంగళగిరి టోల్ ప్లాజా, పేరేచర్ల మరిన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం, వాటిని మరింత ముమ్మరం చేస్తాం. స్పెషల్ డ్రైవ్ చేపట్టి అధిక ధరలకు టికెట్ విక్రయాలు లేకుండా చేస్తాం. ప్రయాణికులు సైతం అధిక ధరలు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకుని రావాలని కోరుతున్నాం.

– షేక్ కరీం, డీటీసీ

హంతకుడికి జీవిత ఖైదు

మార్టూరు: అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చిన భర్తకు బుధవారం ఒంగోలు కోర్టులో న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. ఎస్ఐ రవీంద్రారెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటివారిపాలెం గ్రామానికి చెందిన మెడబలిమి కోటమ్మను మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ప్రేమసాగర్‌తో 2011లో ద్వితీయ వివాహం జరిపించారు. అదే సంవత్సరం జూన్ 15 ఉదయం 8 సమయంలో ప్రేమ సాగర్ తాటి వారి పాలెంలోని తన భార్య పుట్టింట్లో అనుమానంతో హత్య చేశాడు. విచారణలో ప్రేమ సాగర్‌పై హత్యా నేరం రుజువు కావటంతో ఒంగోలు అడిషనల్ జూనియర్ కోర్టు జడ్జి డి. అమ్మని రాజు బుధవారం తీర్పు చెబుతూ నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానా విధించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేందుకు కృషి చేసిన పోలీసులను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఈఓ పి.శైలజ

గుంటూరుఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించిన దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని డీఈఓ పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిరు వ్యాపారులకు తోడూనీడ

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- 25,313 మంది ఖాతాల్లో రూ.60.87 లక్షలు జమ

నరసరావుపేట: చిరువ్యాపారులకు జగనన్న తోడు పథకం ఎంతగానో ఊతమిస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. జగనన్న తోడు ఆరో విడత కార్యక్రమం కింద జిల్లాలో 13,213 మంది చిరు వ్యాపారులకు రూ.1,32,13,000 రుణాలు అందజేశారు. బ్యాంకులకు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కింద 25,313 మందికి రూ.60.87లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులు, సాంప్రదాయ వృత్తిదారులకు ఆరో విడతలో భాగంగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం పంపిణీ, గతంలో రుణాలు పొందిన వారి బ్యాంకు ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జమ చేసే కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, డీడీవో మహాలక్ష్మి, డీపీఎంలు హనుమానాయక్, లక్ష్మీసంతోషమ్మ, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

మమ్మల్ని ఎవ్వరూ ఆదుకోలేదు



గతంలో మమ్మల్ని ఎవ్వరూ ఆదుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన జగనన్న తోడు కార్యక్రమం ఎంతగానో ఆదుకుంది. తొలిసారిగా ప్రభుత్వ సహకారంతో మా కుటుంబాన్ని ఆదుకున్నందుకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– మర్రి అరుణ, గణపవరం గ్రామం, రాజు పాలెం మండలం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా



సత్తెనపల్లి నుంచి ఎనిమిదేళ్ల కిందట బతుకుదెరువు కోసం నరసరావుపేట వచ్చాం. నా భర్త కరెంట్ పనిచేస్తారు. నాకు ఇద్దరు అమ్మాయిలు. గత రెండుసార్లు నాకు జగనన్న తోడు కింద వడ్డీలేని రుణం వచ్చింది. ఇద్దరి పిల్లలను చదివించుకుంటూ ఉపాధి పొందుతున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ రుణపడి ఉంటాం. తీసుకున్న రుణానికి వడ్డీ కూడా తీసుకున్నా.

–వసువులేటి సుభాషిణి, లింగంగుంట్ల గ్రామం, నరసరావుపేట మండలం

ఆదుకున్న ప్రాణదాతలు

- రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు 108 సిబ్బంది అలుపెరగని సేవ
- ఐదుగురు బాధితులను మూడుసార్లు గుంటూరు తరలింపు

మార్టూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మానస పుత్రిక 108 వాహన సిబ్బంది మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం ఉదయం 5 గంటల్లోపు ఐదుగురు బాధితులను మూడుసార్లు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆయన ఆశయాలను సజీవంగా ఉంచారు. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ, లింగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం బలికురవలో ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన కోటేశ్వరమ్మను 108 సిబ్బంది మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వెళ్లిపోయారు. బాధితరాలి కాలికి తీవ్ర గాయాలు కావడంతో రాత్రి 10 గంటల సమయంలో స్థానిక 108 సిబ్బంది ఆమెను గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మార్టూరు ఆసుపత్రిలోకి పూర్తిగా వాహనం రాక మునుపే 12 గంటల సమయంలో రాజుపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఎడ్లు చనిపోయి, ముగ్గురు గాయపడ్డారంటూ స్థానికులు ఫోన్ చేశారు. వెంటనే వాహనం ఆపకుండానే వెనుదిరిగిన సిబ్బంది క్షతగాత్రులు ముగ్గురిని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో దించారు. అనంతరం స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో వివాహిత ఉప్పుటూరు పార్వతి పెట్రోలు పోసుకొని నిప్పంటించుకోగా 4 గంటల సమయంలో మార్టూరు చేరుకున్న 108 సిబ్బందికి ఫోన్ చేశారు. వెంటనే ఆమెకు ప్రథమ చేసుకుంటూ గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న బాధితులు, వారి కుటుంబసభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వారి అభినందనలతో రాత్రింతా పడిన కష్టాన్ని, నిద్ర లేమిని మరచిపోయామని నాగేశ్వరమ్మ, లింగరాజులు ఆనందంతో తెలిపారు.



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న నాగేశ్వరమ్మ

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఆర్చర్ల సత్తా



జాతీయ ఆర్చరీ పోటీల్లో భాగంగా అండర్-14 ఇండియన్ రౌండ్ ర్యాంకింగ్‌లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఆర్చర్లు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన పోటీల్లో 691/700 పాయింట్లతో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలవగా, మహారాష్ట్ర 681/700 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ర్యాంకింగ్ సాధించిన క్రీడాకారులు ఇండియన్ రౌండ్ వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీం విభాగాల్లో గురువారం తలపడతాయని నిర్వాహకులు, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. టీమ్ బాలుర విభాగంలో మహారాష్ట్ర, మణిపూర్, జార్ఖండ్, బాలికల విభాగంలో మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులను సాధించాయి.

– విజయవాడ స్పోర్ట్స్

కత్తి కడితే.. కటకటాలకే !

సంక్రాంతి అంటేనే రంగవల్లులు, పిండివంటలు, భోగిమంటలు, హరిదాసులు.. ఇలా తెలుగింటి సంస్కృతి, సాంప్రదాయాలు గుర్తొస్తాయి. పండగ పూట సాయం సమయంలో కాస్తంత ఆటవిడుపుగా పలు ఆటలపోటీలు, పశువుల పోటీలు, కోడిపందేలు నిర్వహించడం అంతటా కనిపించేదే.. అయితే ఇదే అదనుగా గత కొన్నేళ్లుగా కోడి పందేల నెపంతో జూదం ప్రవేశించి, అనేకుల జీవితాలతో చెలగాటమాడుతోంది. బరులు ఏర్పాటు చేసి మరీ ప్రజల జేబులు కొల్లగొడుతున్న పందెం రాయుళ్లకు కళ్లెం వేసేందుకు జిల్లా పోలీసులు నడుం బిగించారు.

కోడి పందేలపై పోలీసుల ఉక్కుపాదం

- ఇప్పటికే 968 మంది బైండోవర్
- జిల్లాలో 132 పందెం కోళ్లు స్వాధీనం
- 342 మంది జూదరులు అరెస్ట్
- బరులు ధ్వంసం చేసే పనిలో పోలీసులు నిమగ్నం



బాపట్లటౌన్: సంక్రాంతి సందడికి బాపట్ల జిల్లా ముస్తాబవుతోంది. పండుగ సంబరాల్లో భాగంగా కోడిపందేలు నిర్వహించే అవకాశం ఉండటంతో పోలీసులు వీటికి అడ్డుకట్ట వేసేందుకు సన్నద్ధం అయ్యారు. హైకోర్టు ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసులు ఇప్పటికే కొన్ని బరులను ధ్వంసం చేయడంతోపాటు పందేల నిర్వాహకులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి బైండోవర్ కేసులు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాల్లో మొత్తం 1276 మంది పాతనేరస్తులను గుర్తించి వారిలో ఇప్పటికే 968 మందిని బైండోవర్ చేశారు. మరో మూడు రోజుల్లో పండుగ హడావుడి ప్రారంభం కావడంతో పోలీసులు మరింత దూకుడు పెంచారు. స్టేషన్ల పరిధిలో కోడిపందేలు జరిగితే స్థానిక సీఐ, ఎస్‌ఐలే బాధ్యులవుతారని జిల్లా ఎస్పీ ఇప్పటికే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు జరగకుండా పూర్తి స్థాయి నిఘా పెట్టారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా ..

జిల్లాలో గతంలో ఇదే తరహాలో కోడి పందేలు నిర్వహించేవారిని, వారికి కోళ్లు, కత్తులు సరఫరా చేసేవారిని, పందేల సమయంలో కత్తులు కట్టేవారిని 1276 మందిని గుర్తించారు. వారిలో ఇప్పటికి 968 మందిని బైండోవర్ చేశారు. మిగిలిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మారుమూల గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే దాడులు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 67 కేసులు నమోదుచేసి వాటిల్లో 132 పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని 132 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 4,65,795 నగదుతోపాటు 69 వాహనాలను సీజ్‌చేశారు. తాజాగా బాపట్ల పట్టణంలో కోడి పందేల కోసం సిద్ధం చేస్తున్న కత్తుల తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి 250 కోడి కత్తులను, కత్తులు తయారుచేసే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కళ్లు కప్పి....

ఓ వైపు పోలీసుల నిఘా కొనసాగుతున్నప్పటికీ దొడ్డిదారిన కోడి పందేల నిర్వహణకు కొందరు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కోళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ దగ్గర పడటంతో నెమలి, కాకి, డేగ, అబ్రాసు, సీతువ, రసంగి, పర్ల, కక్కెర వంటి జాతుల కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. పుంజు పౌరుషాన్ని, పోరాటే తత్వాన్ని భట్టి రూ. లక్షల్లో ధర పలుకుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పందెం కోళ్ళకు శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో ఇప్పటికే 968 మంది బైండోవర్..

సర్కిల్ పేరు	గుర్తించిన జూదరులు	బైండోవర్ చేసినవాళ్లు	బైండోవర్ చేయాల్సినవాళ్లు
రేపల్లెటౌన్	79	78	01
రేపల్లె రూరల్	412	298	114
చుండూరు	26	22	04
వేమూరు	261	232	29
బాపట్లటౌన్	15	14	01
బాపట్లరూరల్	174	135	39
మార్టూరు	22	22	--
సంతమాగులూరు	13	11	02
చీరాల-2టౌన్	11	11	--
చీరాలరూరల్	108	52	56
ఇంకొల్లు	9	8	01
అద్దంకిరూరల్	49	49	--
అద్దంకి టౌన్	94	35	59
చీరాల-1 టౌన్	3	1	02
మొత్తం	1276	968	308


సాంప్రదాయ క్రీడలతో పండుగ జరుపుకోవాలి



సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి. జిల్లాలో కోడిపందేలు, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు. ఇప్పటికే 968 మందిని బైండోవర్ చేశాం. మిగిలిన వారిని త్వరలోనే బైండోవర్ చేస్తాం. కోడిపందేల కోసం కత్తులు సిద్ధం చేసేవారిపై నిఘా ఉంది. సాంప్రదాయ క్రీడలతో పండుగను జరుపుకోవాలి.

– జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1,600, గరిష్ఠ ధర రూ.2,100, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు

- డీఎస్ఏ స్టేడియంలో ఏర్పాట్లు
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నరసరావుపేట కళావేదిక అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రంలో సంక్రాంతి సంబరాలు 13వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నూతన జిల్లాలో తొలిసారిగా సంబరాలు సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో జిల్లా యంత్రాంగం, శ్రీ నరసరావుపేట కళావేదిక, ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో జబర్దస్త్ నటుడు బుల్లెట్ భాస్కర్ తదితర ఆర్టిస్టులు పాల్గొంటారని చెప్పారు. 14వ తేదీ బోగి సందర్భంగా ఉదయం స్టేషన్‌రోడ్డులోని కేబీఆర్ కాంప్లెక్స్‌లో బోగిమంటలు, అనంతరం స్టేడియంలో బొమ్మల కొలువు, గంగిరెద్దులు, హరిదాసులు తదితర కార్యక్రమాలు ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం సింగర్ సునీత, మల్లీకార్జున, గోపికా పూర్ణిమా, మరి కొంత మంది సింగర్లతో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15వ తేదీ సంక్రాంతి రోజు సాయంత్రం ఇండియన్ లెజెండరీ సింగర్ మాల్గుడి శోభ, ఒడిశా పైకా యాట్, ఈజిప్ట్ ప్రదర్శన చేస్తారన్నారు. 16వ తేదీ కనుమ పండగరోజు సాయంత్రం మిమిక్రీ శివారెడ్డి, టాలీవుడ్ సింగర్ సింహాతో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా పట్టణంలోని ప్రజల కోసం స్టేడియానికి వచ్చేందుకు సాయంత్రం 5గంటల నుంచి కార్యక్రమాలు ముగిసేంత వరకు ఫ్రీగా బస్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు అందరినీ ఆహ్వానించామని అందరూ హాజరవుతామన్నారన్నారు. సమావేశంలో శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఈవెంట్ మేనేజర్ విక్టర్ పాల్గొన్నారు.

ఘనంగా సంబరాలు

నరసరావుపేట: జిల్లా ఏర్పాటు అయిన తర్వాత తొలిసారిగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఈనెల 13,14,15,16 తేదీలలో నరసరావుపేటలోని స్టేడియంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సదరు కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక రంగాలలో ప్రావీణ్యత కలిగిన వారు డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, 91211 90656 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి
- రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు వేదికపై ఎమ్మెల్యే భూమన, ప్రభుత్వ చీఫ్ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సామాజిక న్యాయం పేరిట బీసీలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మాచర్ల పట్టణంలోని జీవీ గ్రాండ్‌లో పార్టీ కార్యకర్తలు, సమన్వయకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ దేశంలోనే బీసీలకు న్యాయం చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతోందని చెప్పారు. ఏనాడూ ప్రజా ప్రతినిధులుగా అసెంబ్లీలో అడుగుపెట్టని సామాజిక వర్గాలను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలుగా గెలిపించిందన్నారు. తొమ్మిది రాజ్యసభ స్థానాలు ఖాళీ అయితే అందులో నలుగురు బీసీలకు ఇవ్వటం చూస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బీసీలపై ఉన్న శ్రద్ధ ఏ పాటిదో అర్థమవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్నమైన పథకాలను ప్రవేశపెట్టి పేదలకు లబ్ధి చేకూర్చుతున్న సంక్షేమ పథకాలను గురించి కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. 2024 ఎన్నికలలో విజయం సాధించటమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని కోరారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకే తాము పరిశీలకులుగా విచ్చేశామన్నారు. కార్యకర్తల నుంచి వచ్చిన సమస్యలను, వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన నియోజక వర్గమైన మాచర్లను ఇప్పటికే రూ.2,800కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్‌లు కిషోర్, కామనబోయిన కోటయ్య, బత్తుల ఏడుకొండలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు యరబోతుల శ్రీనివాసరావు, తాడి వెంకటేశ్వరరెడ్డి, పల్లపాటి గురుబ్రహ్మం పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సంక్రాంతి ముగ్గుల పోటీలు

- విజేతలకు రూ.4లక్షలు నగదు బహుమతులు
- లక్కీడీప్‌లో 114 మందికి బహుమతులు



పట్టణంలో ముగ్గుల పోటీల నిర్వహణ, బహుమతుల ప్రదానోత్సవ ఏర్పాట్లు

సత్తెనపల్లి: ఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను మూడంచెల్లో నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ళుగా సత్తెనపల్లి శాసనసభ్యుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాలు కొనసాగిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. 2018-19లో 2,980 మంది, 2019-20 లో 5,200 మంది, 2020-21 లో 7,300 మంది, 2021-22లో 7,498 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు. దీనిలో భాగంగా ఈ నెల 3 నుంచి 6 వరకు గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లోని విజేతలకు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు మండలాలు, మున్సిపాలిటీ స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మండల, మునిసిపాలిటీ స్థాయిలోని 25 మంది విజేతలకు ఈ నెల 12న(నేడు) నియోజక వర్గస్థాయిలో సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన మహిళలకు నగదు బహుమతులను అందిస్తారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.2 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, చతుర్థ స్థానానికి రూ.25 వేలు నగదు బహుమతులను, ఐదో స్థానానికి ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా.....

ముగ్గుల పోటీలతో పాటు ఆటవిడుపుగా లక్కీ డీప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. ఈ లక్కీ డీప్‌లో ప్రథమ బహుమతి కింద ఒకరికి డైమండ్ నెక్లెస్, రెండో బహుమతిగా ఇద్దరికి రెండు కార్లు, మూడో బహుమతిగా ముగ్గురికి మహీంద్రా 575 మూడు ట్రాకర్లు, నాలుగో బహుమతి కింద నలుగురికి బుల్లెట్లు, ఐదో బహుమతి కింద ఆరుగురికి హోండా షైన్ ద్విచక్ర వాహనాలు, ఆరో బహుమతి కింద 10 మందికి ఫ్రిజ్‌లు, ఏడో బహుమతి కింద 13 మందికి ఎల్‌ఈడీ టీవీలు, ఎనిమిదవ బహుమతి కింద 75 మందికి మిక్సీలు అందించనున్నారు. లక్కీడీప్ ద్వారా 114 మందికి బహుమతులు అందించనున్నారు.

ఇంక్యుబేషన్ సెంటర్లు దోహదం

– వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: మేధస్సు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లు దోహదం చేస్తాయని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. జెస్విడ్ క్రయో టెక్నాలజీ, ట్రీ-డీ హబ్స్ సంస్థలతో కలిసి ఏఎన్‌యూలో ఏర్పాటు చేసిన రెండు ఇంక్యుబేషన్ సెంటర్లను బుధవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిజ్ఞానాన్ని, నూతన అంశాలను ఈ ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా విద్యార్థులు పొందవచ్చని తెలిపారు. ఆయా రంగాలలో నిపుణుల సలహాలు సూచనలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య మాట్లాడుతూ జెస్విడ్ క్రయో టెక్నాలజీ సంస్థతో కలిసి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా క్రయోజనిక్, ఏవియేషన్, న్యూక్లియర్, హైడ్రోజన్, నాచురల్ గ్యాస్, మెరైన్, ఆక్సిజన్, ఫార్మాసూటికల్ రంగాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ అందిస్తామన్నారు. ట్రీ-డీ హబ్స్ సంస్థతో కలిసి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తారన్నారు. జెస్విడ్ క్రయో టెక్నాలజీ సంస్థ ద్వారా అందించే సేవలతో కూడిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఆ సంస్థ ఎండీ నూతక్కి వినోద్ కుమార్, ట్రీ-డీ హబ్స్ సంస్థ ద్వారా అందిచే పరిజ్ఞానానికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఆ సంస్థ ఎండీ కె.సాయి కృష్ణఅనురూప్ సమర్పించారు. రెండు సంస్థలు వేర్వేరుగా ఏఎన్‌యూతో అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఎంఓయూ పత్రాలపై యూనివర్సిటీ అధికారులు, ఆ సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసీఫ్ పాల్గొన్నారు.

22 నుంచి ఒంగోలుజాతి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

నరసరావుపేట: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 22వ తేదీ నుంచి 29 వరకు ఒంగోలు జాతి వృషభరాజాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం బుధవారం స్టేడియంలో భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి సంక్రాంతి సందర్భంగా ఈ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 150 నుంచి 200 ఎడ్ల జతలు పాల్గొంటున్నాయన్నారు. పాలపళ్లు, రెండు, నాలుగు, ఆరుపళ్లు, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సేద్యపు విభాగాలాంటి ఎనిమిది విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రజలు తిలకించేందుకు ఎక్కడా ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కనకా పుల్లారెడ్డి, మూరే రవీంద్రరెడ్డి, వంపుగుడి జాన్, ఇప్పల దానారెడ్డి, హాలీవుడ్ రఘు, పాలిమేర వెంకటరెడ్డి పాల్గొన్నారు.



రైతు ఆత్మహత్యాయత్నం

మాదల(ముప్పాళ్ళ): భూమి హద్దులు మారుస్తున్నారంటూ మండలంలోని మాదల గ్రామానికి చెందిన రైతు మద్రిపూడి లక్ష్మయ్య ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని మాదల గ్రామంలోని సర్వే నంబర్ 546లో మద్రిపూడి లక్ష్మయ్యతో పాటుగా అతడి ఇద్దరు సోదరులకు మొత్తం 73 సెంట్లు పట్టాభూమి ఉంది. ఈ భూమిని లక్ష్మయ్య సాగు చేస్తూ ఉంటాడు. అందులో ఒక సోదరుడి భార్య సీతారావమ్మ వాటా 27 సెంట్లు భూమిని 2008లో సత్తెనపల్లికి చెందిన వారికి అమ్ముకుంది. మిగిలిన 46 సెంట్లు భూమితో పాటుగా సర్వే నంబర్ 563లోని 14 సెంట్లు చెరువు పోరంబోకు భూమిని లక్ష్మయ్య డాక్యుమెంట్లు తయారు చేసుకొని పట్టాదారుపాసుపుస్తకం తీసుకున్నాడు. తదనంతరం అమ్మకం జరిగిన భూమి ముగ్గురు చేతులు మారింది. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన శొంఠినేని శ్రీనివాసరావు 2011, జనవరి 29వ తేదీన కొనుగోలు చేసి హద్దు రాళ్ళు ఏర్పాటు చేసుకున్నాడు. హద్దు రాళ్లు పోవటంతో మరలా భూమి హద్దులు ఏర్పాటు చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేసేందుకు వెళ్లి హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తుండగా హద్దులు తన భూమిలోకి వస్తున్నాయంటూ లక్ష్మయ్య కొలతను అడ్డుకున్నాడు. మూడు రోజులు గడువు ఇస్తూ భూమికి సంబంధించిన పత్రాలతో రావాలంటూ సర్వే సిబ్బంది లక్ష్మయ్య తెలిపి వెనుదిరిగారు. తిరిగి ఈ నెల 10వ తేదీన కొలతకు వెళ్లగా సర్వే సిబ్బందికి, లక్ష్మయ్యకు వాదన చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసు రక్షణతో కొలత చేపట్టి హద్దు రాళ్ల ఏర్పాటు చేశారు. ఆ మేర సంబంధిత స్థలానికి కంచె వేసేందుకు శ్రీనివాసరావు రావటంతో వారిని అడ్డుకొన్న లక్ష్మయ్య పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ఆసుపత్రికి తరలించారు.

నిబంధనల ప్రకారమే కొలతలు తీశాం

మాదలలోని సర్వే నెంబర్ 546 లో దరఖాస్తుదారుడు శొంఠినేని శ్రీనివాసరావు ఇచ్చిన ఆధారాల ప్రకారమే కొలతలు చేపట్టి హద్దులు ఏర్పాటు చేశాం. గతంలో జరిగిన కొలతల సమయంలో ఏర్పాటు చేసిన హద్దులనే మరలా ఏర్పాటు చేశాం. అప్పుడు అంగీకరిస్తూ సంతకం కూడా చేశాడు. పక్క హద్దుదారుడు లక్ష్మయ్య తన పక్కనే ఉన్న చెరువుభూమి 14సెంట్లు ఆక్రమించుకున్నాడు. ఆక్రమించుకున్న భూమి కూడా తన సొంతభూమిగా చూపాలంటున్నాడు.

–యు.ఏడుకొండలు, మండల సర్వేయర్

రీ సర్వే చేయాలని ఆదేశించా

తన భూమిని కొలతలు చేపట్టాలంటూ లక్ష్మయ్య బుధవారం అర్జీ ఇచ్చాడు. భూమికి సంబంధించి ఆధారాలు ఉంటే తీసుకురావాలని చెప్పాం. ఆ మేర రీసర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించాం. స్వయంగా భూమిని పరిశీలించి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తాం. లక్ష్మయ్య ఆరోపణల్లో వాస్తవం లేదు.

–ఎం.భవానీశంకర్, తహసీల్దార్

విశ్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా మణి

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీఎస్ మణి (పల్నాడు), ప్రధాన కార్యదర్శిగా బి.కాశీ విశ్వేశ్వరరావు (అనకాపల్లి) ఎన్నికయ్యారు. గుంటూరులోని జెడ్పీహాల్లో మంగళవారం జరిగిన రాష్ట్ర సంఘ సమావేశంలో భాగంగా రాష్ట్రశాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీవీఎస్ మణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె. సుధాకరరెడ్డి, కేవీవీపీ సత్యనారాయణ, ఎం.భారతిలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా ఎన్ఏపీసీ విద్యాసాగర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎ.సత్యనారాయణరెడ్డి, ఐ.గోపాల్‌రెడ్డి, పి.కస్తూరిబాయి, ఆర్.రామకొండలరావుతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులుగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాగరాజు వ్యవహరించారు.